క్లుప్తంగా

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం


బీజేపీ జెండా ఆవిష్కరిస్తున్న మాధవ్

గోపాలపట్నం: ఎన్‌ఏడీలో గురువారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్ పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. బీజేపీ పురోగతిలో ఎందరో మహానుభావుల త్యాగాలు ఉన్నాయని గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో సుస్థిర పాలనను తమ ప్రభుత్వం అందిస్తోందన్నారు. రాష్ట్ర ప్రజలు బీజేపీపై మొగ్గు చూపుతున్నారన్నారు. బీజేపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త దాడి పురుషోత్తమ రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొలిమేర శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి సీహెచ్ మంజుల, నాయకులు జి.చంద్రశేఖర్ నాయుడు, పి.మాధవి, జ్యోతి, కె.మధుసూదనరావు, బి.నారాయణరావు, కె.సత్యనారాయణ, అప్పలరాజు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో అన్నసంతర్పణ

సీతమ్మధార: పౌర్ణమి సందర్భంగా నక్కవానిపాలెం ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ చేపట్టారు. ట్రస్టు ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

ఆడపడుచులకు అండగా జగనన్న


పొదుపు సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్‌ను అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్, కమిషనర్ రాజాబాబు, పంచకర్ల రమేష్‌బాబు


సీఎం వైఎస్ జగన్ ఫ్లకార్డులు ప్రదర్శిస్తున్న మహిళలు

- పేద కుటుంబాల్లో ఆనందమే సీఎం జగన్ ఆశయం
- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్
- 59వ వార్డులో పండగలా 'వైఎస్సార్ ఆసరా' చెక్కుల పంపిణీ

మల్కాపురం: పేదింటి ఆడపడుచులకు అండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ కొనియాడారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్క పేద కుటుంబం ఎల్లప్పుడూ చిరునవ్వులు చిందించాలన్నదే జగనన్న ఆశయమని పేర్కొన్నారు. 59వ వార్డు ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీలో గురువారం వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా పొదుపు సంఘాల మహిళలకు మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం పండగలా నిర్వహించారు. కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ, సురేష్ యాదవ్‌ల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యే, ఎన్నికల పరిశీలకుడు ఎస్‌ఏ రెహమాన్, పార్టీ మహిళా అధ్యక్షురాలు కృపా, జీవీఎంసీ కమిషనర్ రాజాబాబులతో కలిసి ఆడారి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వీరంతా కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

18,029 మందికి లబ్ధి..

ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ పని చేస్తున్నారన్నారు. గత ఎన్నికల ముందు పేదలకు ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని పేర్కొన్నారు. పారిశ్రామిక ప్రాంతంలోని 40, 58, 59, 60, 61, 62 63 వార్డుల పరిధిలో సుమారు 1,740 పొదుపు సంఘాలు, 18,029 మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. వీరందరికీ ఆసరా పథకం మూడో విడత కింద రూ.9.56 కోట్లు వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తున్నట్లు చెప్పారు.

సద్వినియోగం చేసుకోండి..

జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు మాట్లాడుతూ పొదుపు సంఘాల మహిళలు ప్రభుత్వం అందిస్తున్న ఆసరా సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని


సభా ప్రాంగణం వద్ద సంక్షేమ పథకాల ముగ్గు వేస్తున్న ఆర్పీలు

సూచించారు. తాము అందుకున్న రుణాలతో చిన్న స్థాయి పరిశ్రమలను స్థాపించి పలువురికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి నాయకులంతా క్షీరాభిషేకం చేశారు. సంక్షేమ పథకాల వారధి జగనన్నను కీర్తిస్తూ రేలారే రేలా జానపద నృత్య కళాకారులు వేదికపై నృత్యాలు చేసి అలరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మావతి, ప్రాజెక్ట్ డైరెక్టర్ బాపునాయుడు, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, కార్పొరేటర్లు కొణతాల సుధ, బల్ల లక్ష్మణరావు, గులిగిందల లావణ్య, పలు వార్డుల యూసీడీ సీవోలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మరింత చేరువగా ప్రభుత్వం


మాట్లాడుతున్న బెహరా భాస్కరరావు


ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పార్టీ శ్రేణులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు

గోపాలపట్నం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మరింత చేరువయ్యేందుకు తలపెట్టిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు పిలుపునిచ్చారు. గోపాలపట్నం కుమారి కల్యాణ మండపంలో గురువారం 91, 92 వార్డుల కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ఆర్పీలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సూచనల మేరకు ఈ నెల 7 నుంచి 20 వరకు జగనన్నే మా భవిష్యత్తు అనే నినాదంతో ప్రతి ఇంటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం చేసే మంచిని ప్రజలకు వివరించాలన్నారు. వలంటీర్ల సహకారంతో గృహసారథులు కుటుంబాలను కలిసి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలు ఉన్నాయా ఆరా తీయాలని తెలిపారు. సచివాలయ కన్వీనర్లు స్థానిక నాయకులతో కలిసి గృహసారథుల నుంచి సమస్యల గురించి వివరాలు సేకరించాలని చెప్పారు. వాటిని తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షులు అప్పలస్వామి, గుణిశెట్టి శ్రీనివాసరావు, 89, 90, 91, 92 వార్డుల ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్తు'ను జయప్రదం చేద్దాం

మల్కాపురం: ఈ నెల 7వ తేదీ శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న మా నమ్మకం నువ్వే జగన్–జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత గృహసారథులు, సచివాలయ కన్వీనర్లపైనే ఉందని 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ అన్నారు. మల్కాపురం, జనతా కాలనీ, గాంధీజీ వీధి, జాలరి వీధి సచివాలయాల వద్ద వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. మల్కాపురం సచివాలయంలో ఆమె మాట్లాడుతూ ప్రజల్లోకి సంక్షేమ పథకాలను విస్తృతంగా తీసుకెళ్లి నీతివంతమైన పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాల్సిన అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ ఐటీ విభాగ ప్రతినిధి కొల్లి నూకరెడ్డి, చట్టి నూకరాజు, సోనూ, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 58వ వార్డు గుల్లలపాలెం, ములగాడ తదితర సచివాలయాల్లో గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లతో కార్పొరేటర్ గులిగిందల లావణ్య, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కృష్ణ సమావేశమయ్యారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.


మాట్లాడుతున్న కార్పొరేటర్ సుధ

ఇంటింటికీ వెళ్లండి.. పథకాలను వివరించండి

గోపాలపట్నం: ఈ నెల 7 నుంచి జరగనున్న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ 89వ వార్డు అధ్యక్షుడు దొడ్డి కిరణ్ పిలుపునిచ్చారు. కొత్తపాలెం వార్డు కార్యాలయంలో గురువారం గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలన్నారు. నాలుగు వార్డుల ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతి వలంటీర్, గృహసారథులు ఉదయం, సాయంత్రం వేళల్లో ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబ సభ్యులకు కలవాలని సూచించారు. ఆళ్ల పైడిరాజు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన


సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందిస్తున్న ఆడారి అనంద్‌కుమార్, బద్రీనాథ్

సింధియా: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 63వ వార్డు ఏకేసీ కాలనీ–2 సచివాలయం(1086321) పరిధిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 61వ రోజు ఉత్సాహంగా సాగింది. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి, వార్డు అధ్యక్షుడు సోమాదుల సురేష్ ఆధ్వర్యంలో ఆడారి ఆనంద్‌కుమార్, జిల్లా ట్రేడ్ యూనియన్ నాయకుడు కలిదిండి బద్రీనాథ్‌లు 200 గడపలను సందర్శించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. స్థానికులు విన్నవించిన సమస్యలను సంబంధిత అధికారులకు తెలియజేసి సత్వర పరిష్కార దిశగా మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ పారదర్శకంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు ప్రజలందరూ ధన్యవాదాలు తెలుపుతున్నారన్నారు. కార్యక్రమంలో 40, 60 వార్డుల కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, పి.వి.సురేష్, పేండీ మల్లేష్, పునుకు రమణ, కొట్యాన రవి, సూరాడ పెంటారావు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

బౌద్ధాలయంలో సేవా కార్యక్రమం

కంచరపాలెం: అశోక్‌నగర్ బౌద్ధాలయంలో ఆంధ్ర బౌద్ధ కేంద్ర సమాజం ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్ ఆధ్వర్యంలో గురువారం పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. పేద మహిళలకు చీరలు అందజేసి, అన్నదానం చేశారు. ముందుగా బుద్ధుని విగ్రహానికి పూల మాలలు వేసి పూజలు జరిపారు. కార్యక్రమంలో సీహెచ్ బాబూరావు, రాజు, భీమారావు, సూరిబాబు, రాము, రామచంద్రరావు, పరిమళ, సునీల్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌ఏడీలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

గోపాలపట్నం: మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కంచరపాలెం పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఎన్‌ఏడీ జంక్షన్ జాతీయ రహదారి ఎన్‌ఎస్టీఎల్ సమీపంలో గురువారం కంచరపాలెం ఎస్‌ఐ వాసుదేవరావు బ్రీత్ ఎనలైజర్లతో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం తాగి నడపడం వల్ల ప్రమాదాల బారిన పడతారన్నారు. రోడ్డు నిబంధనలు పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ లక్ష్మణరావు, కానిస్టేబుల్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

10న విద్యుత్ వినియోగదారుల సదస్సు

మధురవాడ: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న మధురవాడలోని ఏపీఈపీడీసీఎల్ జోన్–3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో సదస్సు నిర్వహించనున్నట్టు ఈఈ పి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటన్నర వరకు జరుగుతుందని పేర్కొన్నారు. సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్, కమిటీ సభ్యులు హాజరయ్యే ఈ సదస్సులో జోన్–3 పరిధిలోని మధురవాడ, గోపాలపట్నం, పెందుర్తి, ఆనందపురం, భీమిలి సబ్ డివిజన్ల పరిధిలోని వినియోగదారులు పాల్గొని తమ సమస్యలు విన్నవించుకోవచ్చునని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే అందరి లక్ష్యం


సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు సూచనలిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు


సింధియా: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా గురువారం ఏకేసీ కాలనీలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ శుక్రవారం నుంచి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని చెప్పారు. ఇంటింటికీ వెళ్లి అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారిని గుర్తించి వాటిని వర్తింపజేయాలని సూచించారు. ప్రతి ఇంటి గోడ మీద జగనన్నే మా భవిష్యత్తు అనే స్టిక్కర్‌ను అతికించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు వరపల మహేష్, కన్వీనర్లు గుండపు అశోక్, దండి శ్యామ్, పెంట్ల బాలకృష్ణ, శరగడం గంగరాజు, మీసాల సత్యనారాయణ, చొక్కాపు రమణ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కన్వీనర్లు, గృహసారథులకు దిశానిర్దేశం


సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కార్పొరేటర్ లక్ష్మణరావు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు అంబేడ్కర్ కాలనీలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంపై సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు దిశానిర్దేశం చేశారు. ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 7 నుంచి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు.

గుడ్‌ఫ్రైడే ప్రార్థనలకు రక్షణగిరి సిద్ధం


ముస్తాబవుతున్న జ్ఞానాపురం రక్షణగిరి

కంచరపాలెం: జ్ఞానాపురం రక్షణగిరిలో ఈ నెల 7వ తేదీ శుక్రవారం గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు సెయింట్ పీటర్స్ పునీత పేతురు దేవాలయం విచారణ కర్త రెవరెండ్ ఫాదర్ డాక్టర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ తెలిపారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విశాఖ అర్చిబిషప్ (అతిమేత్రానులు) ఫాదర్ మల్లావరపు ప్రకాశ్ విచ్చేయనున్నట్లు తెలిపారు. రెవరెండ్ ఫాదర్ల నేతృత్వంలో శిలువను మోసుకుంటూ వేలాది మంది భక్తులతో కలిసి రక్షణగిరిపైకి శిలువ మార్గం నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీస్తు మరణాన్ని సూచిస్తూ ఏర్పాటు చేసిన 14 విగ్రహాల వద్ద ప్రార్థిస్తూ ప్రదక్షిణలు చేయనున్నట్టు ఫాదర్ జాన్‌ప్రకాష్ తెలిపారు. ఉదయం 5.30 గంటలకు సెయింట్ పీటర్స్ చర్చి నుంచి రక్షణగిరి వరకు నిర్వహించే శిలువ మార్గ ప్రార్థనల్లో క్రైస్తవ భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

కంచరపాలెం రైల్వే ట్రాక్ సమస్యపై డీఆర్‌ఎంకు వినతి

తాటిచెట్లపాలెం: కంచరపాలెం, రామ్మూర్తిపంతులుపేట వద్ద ఉన్న రైల్వే ట్రాక్ సమస్యపై సీబీఐ మాజీ జేడీ వి.వి.లక్ష్మీనారాయణ గురువారం డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతిని కలిసి వినతిపత్రం సమర్పించారు. తరచూ ప్రజలు రైల్వే ట్రాక్‌ను దాటేటప్పుడు ప్రమాదాలకు గురవుతున్నారని, ఈ సమస్యపై సానుకూలంగా స్పందించి ప్రత్యామ్నాయం చూపించాలని డీఆర్‌ఎంను కోరారు.

సమాచారమ్

అందుబాటులో జోన్–8 అధికారులు

గోపాలపట్నం: జీవీఎంసీ జోన్–8 అధికారులు ప్రజలకు అందుబాటులో ఉన్నారు. ఏవైనా సమస్యలపై ఫిర్యాదు చేయడానికి, సమాచారం తెలుసుకోడానికి కింది పేర్కొన్న అధికారుల ఫోన్ నంబర్లకు ప్రజలు కాల్ చేయవచ్చు.

అధికారుల ఫోన్ నంబర్లు

జోనల్ కమిషనర్	మల్లయ్య నాయుడు	99123 49439
సూపరింటెండెంట్	పి.వి.వి.ఎస్.ఎస్.మూర్తి	98481 12030
టౌన్ ప్లానింగ్ ఏసీపీ	ఎస్.నస్తి షబ్నమ్	98489 33236
టీపీఎస్	పి.ప్రమీలారాణి	81878 98438
శానిటరీ సూపర్‌వైజర్	కె.వి.రమణ	99488 83940
రెవెన్యూ అధికారి	వి.నారాయణరావు	98485 22347
ఏపీడీ	వై.వై.శ్రీరామ్	77299 99788
ఈఈ వర్క్స్	బి.హెచ్.సంతోషికుమారి	99123 49485
ఈఈ ఎలక్ట్రికల్	డి శ్రీధర్	99480 78504
ఈఈ యూజీడీ	వెంకటేశ్వరరావు	79897 72161
డీఈ వర్క్స్	జి.శ్రీనివాసరాజు	77299 95949
ఏఈ ఎలక్ట్రికల్	కె.రాధిక	77299 95942
ఏఈ వాటర్ సప్లయ్	కె.గణేష్ రాజశేఖర్	81878 99219

'సెలవు రోజుల్లో పన్నులు చెల్లించవచ్చు'

గోపాలపట్నం: మూడు రోజులు సెలవులు రావడంతో జీవీఎంసీ పన్నులు చెల్లించేందుకు జోన్–8 కార్యాలయంలో సౌకర్యం కేంద్రం అందుబాటులో ఉంటుందని జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు తెలిపారు. నిబంధనల ప్రకారం 5 శాతం తగ్గింపుతో శుక్ర, శని, ఆదివారాల్లో ట్యాక్స్‌లు చెల్లించవచ్చని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్సీ కోరారు.

జాతీయ రహదారిపై కారును ఢీకొట్టిన లారీ


డివైడర్‌పైకి ఎక్కిన కారు

మర్రిపాలెం: కంచరపాలెం జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. గురువారం ఉదయం తాటిచెట్లపాలెం నుంచి ఎన్‌ఏడీ వైపు వెళ్తున్న కారును.. లారీ ఢీకొట్టింది. ఎన్‌ఏడీ వైపు తమ బంధువుల ఇంటికి వెళ్తున్న పోతల సత్యనారాయణ కారును అదే దారిలో వెనుక వస్తున్న లారీ అధిగమించే క్రమంలో కారు పక్క భాగాన్ని ఢీకొంది. దీంతో ఒక్కసారిగా కారు అదుపుతప్పి డివైడర్‌పైకి వెళ్లిపోయింది. ఎటువంటి ప్రాణహాని జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి కారులో ఎవరెవరున్నారు అనే వాటిపై పూర్తి వివరాలు తెలియరాలేదు. సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కంచరపాలెం సీఐ ఎస్.విజయ్‌కుమార్ నేతృత్వంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు


లలితాదేవి

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఐటీఐ జంక్షన్ వద్ద తుమ్మడిపాలెంలో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న లలితాదేవి అనే యువతి ఫిజియోథెరపిస్ట్‌గా పనిచేస్తోంది. ఈ నెల 4న ఓ రోగికి ఫిజియోథెరపీ చేయాలని ఇంటి నుంచి వెళ్లి తిరిగి చేరుకోకపోవడంతో తల్లిదండ్రులు పలు చోట్ల గాలించారు. ఎంత వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో గురువారం సాయంత్రం యువతి తండ్రి సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఎవరికైనా కనిపిస్తే స్టేషన్‌లో సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

వైభవుడి దివ్యక్షేత్రంలో పౌర్ణమి వేడుకలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రంలో చైత్ర మాసం పౌర్ణమి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు వైభవుడికి ఆర్జిత సుప్రభాత సేవ నిర్వహించారు. సేవా దాతలు, భక్తులు మంగళధ్వనితో వేద మంత్రోచ్ఛారణల మధ్య అభిషేక ప్రదక్షిణ చేశారు. శ్రీవారికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పంచదార, ఫలరసాలు, పసుపు, కుంకుమ, చందనం వంటి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. ఈవో ప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.